తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



ఆలయంలో ఆకాశ దీపం వెలిగిస్తున్న దృశ్యం

# శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక శోభ

శ్రీకాళహస్తి,అక్టోబర్ 26 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం శోభ చోటు చేసుకుంది. బుధవారం శివయ్య సన్నిధిలో కోట మండపం వద్ద ఆకాశ దీపం వెలిగించి శ్రీకారం చుట్టారు. బుధవారం వచ్చే నెల 23 వరకు కార్తీక మాసం నిర్వహించబడుతుందన్నారు.ఈ నెల 29న కార్తీక శుద్ధ చవితి నాడు నాగుల చవితిని నిర్వహిస్తున్నట్లు ఇఓ వికెసాగర్‌బాబు తెలిపారు.మోక్ష గోపురం వద్ద ఉన్న నాగుల కట్ట వద్ద, రుద్రపాదాలకు 'నాగుల చవితి' సందర్భంగా అభిషేకాలు నిర్వహిస్తామన్నారు.ఇక కార్తీక మాసం నాలుగు సోమవారాల్లో ఆలయంలో దర్శనాల సమయాలను మార్చినట్లు వివరించారు. ఈ సందర్భంగా మొదటి కాలాభిషేకం ఉదయం 5గంటలకు,రెండవ కాలాభిషేకం ఉదయం 6గంటలకు, ఆలయం తలుపులు వేకువ జాము 4గంటలకు భక్తులకు దర్శనం కల్పించబడుతుం దన్నారు. రాత్రి 9.30 గంటలకు పవళింపు సేవను నిర్వహిస్తామన్నారు. మూడవ కాలాభిషేకం ఉదయం 10గంటలకు దేవస్థానం నిర్వహిస్తామన్నారు. కాగా నాల్గవ కాలాభిషేకం మధ్యాహ్నం 3.30గంటలకు జరుపుబడుతుందని వివరించారు.ఆకాశదీపం వెలిగింపు కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు,సభ్యులు కొండూరు సునీత,ప్రత్యేక ఆహ్వానితులు శ్రీదేవి,ఇఓ వికె సాగర్‌బాబు, డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఎసి మల్లికార్జున్ ప్రసాద్,టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరాజు, హరియాదవ్, పౌరోహితులు అర్ధగిరి స్వామి పాల్గొన్నారు.

# నవంబర్ 1 నుండి ప్లాస్టిక్ నిషేధం

## ప్లాస్టిక్స్ ఫ్లెక్సీలు, బ్యానర్లు బంద్
## తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి



తిరుపతిరూరల్, అక్టోబర్26 ప్రభాతవార్త:

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తిరుపతి జిల్లాలో ప్లాస్టిక్స్‌ను పూర్తిస్థాయిలో నిషేధిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 65 మేరకు పర్యావరణాన్ని కలుషితం చేసే ప్లాస్టిక్, ప్లాస్టిక్స్ బ్యానర్లు,, ఫ్లెక్సీలను నవంబర్ 1వ తేదీ నుండి పూర్తిగా బంద్ చేస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ నిషేధానికి ఫ్లెక్సీ ప్రింటర్స్ యజమానులు సహకరించాలని కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో ఫ్లెక్సీ ప్రింటర్ల యజమానులతో జిల్లా కలెక్టర్, నగరపాలక కమిషనర్ అనుపమ అంజలి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణానికి నష్టం కలుగుతుందనే ఉద్దేశంతో చేపట్టిన ఫ్లెక్సీ బ్యానర్ల నిషేధం మంచి కార్యక్రమమం అని, జిల్లాలో దాదాపు 55మంది తయారీదారులు ఉన్నారని, నిషేధానికి సహకరించాలని కోరారు. ప్రభుత్వ సూచనలు, ఆదేశాల మేరకు ప్లాస్టిక్స్‌కు ప్రత్యామ్నాయంగా క్లాత్ బ్యానర్లు వాడకం అమలులోకి రావాలన్నారు. అందుకు కావావాల్సిన ప్రభుత్వ సమాయం, రుణ సౌకర్యం కల్పించడం, ఇందులో పనిచేస్తున్న కార్మికులకు ఉచిత ప్రత్యామ్నయ శిక్షణ వంటివి కల్పించనున్నామని తెలిపారు. ఫ్లెక్సీ ప్రింటర్స్ యాజమానుల సూచించే సూచనలు ప్రభుత్వ పరిశీలనకు పంపి తగు చర్యల చేపడతామన్నారు. నగరపాలక కమిషనర్ అనుపమ అంజలి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ఫ్లెక్సీ బ్యానర్లు బయో డీగ్రేడబుల్ కాదని, తప్పనిసరి బయో డీగ్రేడబుల్ వాడవల్సి ఉంటుందని తెలిపారు. ఫ్లెక్సీ ప్రింటర్ల యజమానులు మాట్లాడుతూ ప్రింటర్ మిషన్ల మార్పులు కోసం 10 నుండి 15 లక్షల ఖర్చు అవుతుందని, ప్రస్తుతం మా దగ్గర ఉన్న నిల్వ మెటీరియల్ సంబంధిత సరఫరాదారులు తిరిగి తీసుకోరని, ఇందుకోసం సమయం, ఋణం, సబ్సీడి వంటివి అందించాలని, నవంబర్ 1 నుండి అపరాధ రుసుం ఒక చదరపు అడుగుకు రూ.100 నిర్ధేశించారని, ప్రస్తుతం ఉన్న మిషన్లు రెండు మూడు రోజులు ఆగితే హెడ్ మార్పుకు లక్షల్లో ఖర్చు అవుతుందని కలెక్టర్‌కు వివరించారు. ఫ్లెక్సీ ప్రింటర్స్ యజమానుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్షలో తిరుపతి జిల్లా ఫ్లెక్సీ ప్రింటర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అనిల్‌కుమార్, గౌరవ అధ్యక్షులు శంకర్, ఉదయ్ సింగ్, వైస్ ప్రెసిడెంట్ రాధాకృష్ణ, జనరల్ సెక్రటరీ బాలాజీ, ప్రింటర్స్ యజమానులు పాల్గొన్నారు.

# టిటిడి "టూర్‌ప్యాకేజీ" ఉత్తుత్తేనా!





ప్రభాతవార్తప్రతినిధి–తిరుమల:

కలియుగప్రత్యక్షదైవమ్ ఏడుకొండల వెంకన్న దర్శనార్థమ్ దేశవిదేశాల నుంచి తిరుమలకు వచ్చే భక్తులు గంటలతరబడి వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ కంపార్టుమెంట్లలో వేచివుండకుండా, భక్తులు తిరుపతిలోనే బసచేసి ఆలయాల సందర్శన పేరుతో టిటిడి నూతనంగా తీసుకురానున్న "టూర్‌ప్యాకేజీ"ప్రతిపాదనలు కార్యరూపం దాల్చడంలేదు. ఈ టూర్‌ప్యాకేజీ అమలుకు ముందు తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో రోజుకు 20వేల టైమ్‌స్లాట్ సర్వదర్శనం టోకెన్లు జారీచేసే ప్రక్రియ మొదలుపెట్టాల్సి ఉంది. ఈ టైమ్‌స్లాట్ టోకెన్ల జారీని బ్రహ్మోత్సవాలు (అక్టోబర్ 5తో)ముగిసిన తరువాత లాంఛనంగా పునరుద్ధరించే యోచనతో టిటిడి పెద్దలు భావించారు. అయితే ఇప్పటికీ టిటిడిలో టైమ్‌స్లాట్ దిశగా కార్యాచరణ అమలుచేయలేకపోతుండటం, సాధారణ సర్వదర్శనాలే కొనసాగుతుండటం జరుగుతోంది. ఈ నేపధ్యంలో వారాంతం శుక్ర. శని,ఆదివారాల్లోనేగాక సాధారణ రోజుల్లో కూడా తిరుమలకొండపై 90వేలమంది వరకు భక్తులు ఉంటున్నారు. వారిలో 70వేలమందివరకు భక్తులకు రోజువారీగా సరాసరి టిటిడి దర్శనం చేయిస్తోంది. మిగిలిన 20వేలమంది అలాగే గంటల తరబడి కొండపై కంపార్టుమెంట్లలో, రద్దీ పెరిగితే అదనపు క్యూలైన్లలో నిరీక్షిస్తుండటం కనిపిస్తోంది. ఈ కారణంగా కొండపై గదులు కూడా సరిపోకపోతుండటంతో తిరుపతిలోనే భక్తులు బసచేసే అవకాశం తీసుకురావాలని టిటిడి నిర్ణయం మంచిదే అయినా అందుకు కొన్ని ప్రయోగాత్మక నిర్ణయాలు ఆచరణకు రావడంలేదు. దీంతో సామాన్యభక్తులు కొండెక్కితే పలు ఇబ్బందులు తప్పడంలేదు. కొండపై భక్తులకు కష్టాలు తొలగించే ప్రయత్నంలో తిరుపతి పరిసరాలతోబాటు టిటిడి అనుబంధంగా ఉన్న పలు పుణ్యక్షేత్రాల సందర్శనకు "టూర్‌ప్యాకేజీ" పేరుతో ప్రతిపాదనలను గత జూన్ నెలలోనే టిటిడి అధికారులు ఆలోచన చేశారు. అయితే ఈ ఆలోచనకు ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం తిరుపతిలో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఆలయాల సందర్శన పేరుతో

## నాలుగునెలలు కావస్తున్నా ఊసేదీ?

జిల్లాలోని కొన్ని ఆలయాలకు ప్రత్యేక ప్యాకేజీ బస్సులను పరిమితంగానే నడుపుతోంది. టిటిడి ఇందుకు భిన్నంగా జిల్లాలోనేగాక పక్కజిల్లాల్లో ఉన్న అనుబంధ ఆలయాలకు "టూర్‌ప్యాకేజీ" బస్సులు నడపాలని ,దీనివల్ల భక్తులకు సమయం కలిసివచ్చి, కొత్త ప్రాంతాలను, ఆలయాలను సందర్శించిన అనుభూతి కలుగుతుందని అభిప్రాయంవ్యక్తమైంది. ఆచరణకు మాత్రం నోచుకోలేదు.

–టిటిడి "టూర్‌ప్యాకేజీ" అమలు ఇలా!:

సామాన్యభక్తులకు గోవిందుని సులభ దర్శనం కల్పించేందుకు తిరుపతిలో సర్వదర్శన సమయనిర్దేశిత టోకెన్ల జారీవిధానం అమలైతే,టోకెన్లు కలిగిన భక్తులు నేరుగా తిరుమలకు చేరుకుని ఇబ్బంది పడే అవసరం లేకుండా చూడటానికి "టూర్‌ప్యాకేజీ" ఉపయోగపడుతుంది. టైమ్‌స్లాట్ సర్వదర్శన టోకెన్లు అందుకున్న భక్తులు నిర్ధేశించిన సమయంలో ఆ రోజు గంటముందు కొండపైకి చేరుకుని నేరుగా వైకుంఠం క్యూలైన్లద్వారా ఆలయంలోనికి ప్రవేశించేలా చూడాలనేది టిటిడి అధికారుల ఆలోచన. భక్తుల రద్దీని బట్టి జారీచేయనున్న టైమ్‌స్లాట్ దర్శన టోకెన్లు భక్తులను "పుణ్యక్షేత్రాల సందర్శన"పేరుతో టూర్‌ప్యాకేజీ నిర్ణయించి, తిరుపతి స్థానిక ఆలయాలైన కపిలతీర్థం, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, శ్రీనివాసమంగాపురం, అప్పలాయగుంటతో బాటు కాణిపాకం,శ్రీకాళహస్తి, ఒంటిమిట్ట ఆలయాలను సందర్శించే అవకాశం కల్పించాలనేది టూర్‌ప్యాకేజీ ఉద్దేశ్యం.

# షార్ నుంచి
# ప్రతి నెలా ప్రయోగమే

## ఇందులో అన్ని తరహా రాకెట్లు





ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్, షార్ డైరెక్టర్ ఎ.రాజరాజన్

శ్రీహరికోట (తడ), అక్టోబర్ 26 ప్రభాతవార్త

శ్రీహరికోట నుంచి ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రతి నెలా రాకెట్ ప్రయోగం నిర్వహించడానికి శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు. ఎల్‌వీఎం–3 రాకెట్ ప్రయోగం విజయం తర్వాత పలు సందర్భాలలో ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ ఈ మేరకు భవిష్యత్ ప్రయోగాల గురించి ప్రకటించారు. షార్‌లోనూ డైరెక్టర్ ఎ.రాజరాజన్ ఆధ్వర్యాన మొదటి, రెండవ ప్రయోగ వేదికలలో రాకెట్ ప్రయోగాల ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెలలో ఎల్‌వీఎం–3 ప్రయోగం జరపగా, నవంబర్‌లో పీఎస్ఎల్‌వీ సీ–54 రాకెట్ ప్రయోగానికి చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. డిసెంబర్‌లో స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ ప్రయోగం ఉంటుంది. జనవరి నెలలో మరొక ఎల్‌వీఎం–3 ఎం3 రాకెట్‌ను ప్రయోగించి వన్‌వెబ్‌కు చెందిన 36 ఉపగ్రహాలను అంతరిక్ష కక్ష్యలో ప్రవేశపెట్టాల్సి ఉంది. ఫిబ్రవరి నెలలో జీఎస్ఎల్‌వీ ఎం2 రాకెట్‌ను ప్రయోగించడానికి షార్ సిద్ధమవుతోంది. మార్చి నెలలోనే పీఎస్ఎల్‌వీ రాకెట్ ద్వారా ఆదిత్య ఎల్–1 ఉపగ్రహాన్ని ప్రయోగించడానికి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ, న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత స్వదేశీ, విదేశీ ఉపగ్రహాల ప్రయోగాలతో పాటు ఇస్రోతో పాటు ప్రైవేటు రాకెట్ల నిర్మాణం ఊపందుకుంది. మార్చి 31తో ముగియనున్న ఆర్థిక సంవత్సరంలో ఈ రాకెట్లను సిద్ధం చేసి ప్రయోగిస్తున్నారు. ఇందులో ఎస్ఎస్ఎల్‌వీ, పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ, మార్క్3 తరహా రాకెట్లన్నీ వరుస శ్రేణిలో రావడం విశేషంగా పేర్కొంటున్నారు. అన్నీ అనుకూలిస్తే 2023లోనే ఎల్అండ్‌టీ, హెచ్ఎఎల్ ప్రైవేటు సంస్థలకు ఇస్రో అప్పగించిన ఐదు పీఎస్ఎల్‌వీ శ్రేణి రాకెట్లలో కొన్ని ప్రయోగించే అవకాశం లేకపోలేదు.

# అవినీతికి శిక్ష..

## కానిస్టేబుల్ సస్పెండ్.. ఎస్ఐకి చార్జి మెమో

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 26, ప్రభాతవార్త

అవినీతికి శిక్ష పడింది, వాహన ప్రమాద కారకుల నుంచి 40 వేలు లంచం తీసుకున్న ఎంఆర్‌పల్లి కానిస్టేబుల్ వినోద్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ రవి ప్రకాష్ ఉత్తర్వులు జారీ చేసారు. వివరాల్లోకెళితే ఈ నెల 8న రాత్రి కర్ణాటకకు చెందిన టెంపో ట్రావెలర్ వాహనం తిరుపతి నుంచి బెంగళూరు వైపు వెళ్తుంది. తిరుపతి రూరల్ పాత కాలువ సమీపంలో వన్‌వేలో వస్తున్న ఆటోను ఢీ కొట్టింది. ఆటో డ్రైవర్ సయ్యద్ భాష, అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న చంద్రగిరి గొల్లవానికాల్వకు చెందిన మహమ్మర్ అజీరా షెహిన్ చికిత్స పొందుతూ 10వ తేది మరణించింది. మున్నీర్, ఆసిఫా, ఫాతిమాలకు గాయాలయ్యాయి. ఎంఆర్‌పల్లి ఎస్ఐ సతీష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### వాహనం విడుదల చేయడానికి 40 వేలు వసూలు..

ప్రమాదానికి గురైన టెంపో ట్రావెలర్, ఆటోలను ఎంఆర్‌పల్లి పోలీస్ స్టేషన్‌కి తరలించారు. ప్రమాదానికి కారణమైన టెంపో ట్రావెలర్ వాహనాన్ని రవాణా శాఖ అధికారికి సమాచారం ఇచ్చి వాహన సామర్థ్య పరీక్షలు నిర్వహించాలి తరువాత వాహన యజమానికి అప్పగించాలి, అయితే ఎంఆర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో రైటర్‌గా పని చేస్తున్న వినోద్ కుమార్ వాహనాన్ని విడుదల చేయాలంటే 40 వేలు లంచం ఇవ్వాలని వాహన యజమాని ఉమేష్‌ను డిమాండ్ చేసి తీసుకున్నాడు. రోజులు గడుస్తున్నా తమ వాహనాన్ని ఇవ్వకపోవడంతో రైటర్ వినోద్ కుమార్‌ని అడిగారు. వాహనం విడుదల చేయాలంటే మరో 20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఈ నెల 15న అనంతపురం రేంజ్ డిఐజి రవిప్రకాష్‌కి ఫిర్యాదు చేశాడు. డిఐజీ జరిగిన సంఘటనపై విచారించాలని తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి ఆదేశించారు. స్పందించిన ఎస్పీ తిరుపతి వెస్ట్ డిఎస్పి నర్సప్ప విచారణ చేపట్టి నివేధిక ఇవ్వాలని ఆదేశించారు. డిఎస్‌పి విచారణలో వాహనం విడుదల చేయడానికి లంచం తీసుకున్నది నిజమేనని ప్రాథమికంగా నిర్ధారించారు. జిల్లా ఎస్పికి నివేదిక అందజేసారు. దీంతో బుధవారం కానిస్టేబుల్ వినోద్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ డిఐజి ఉత్తర్వులు జారీ చేసారు.

### విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఎస్ఐకి మెమో...

ప్రమాదం జరిగిన సంఘటన స్థలాన్ని ఎస్ఐ సతీష్ కుమార్ పరిశీలించలేదని, కేసును రైటర్‌కి అప్పగించారని విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఎస్ఐకి ఛార్జ్ మెమో ఇచ్చారు.

## రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికే
# మూడు రాజధానులు

## -మద్దతుగా 29న రాయలసీమ ఆత్మగౌరవ మహా ప్రదర్శన
## -తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి



తిరుపతి ప్రెస్‌క్లబ్,అక్టోబర్ 26 ప్రభాతవార్త:

గతంలో అభివృద్ధి మొత్తం హైదరాబాద్‌లో పెట్టినందుకు రాష్ట్ర విభజన అనంతరం ఆదాయం మొత్తం కోల్పోయామని,ఇప్పుడు అమరావతిలో అలా జరగకూడదనే దూర ఆలోచనతో రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం మూడు రాజధానులను చేస్తున్నారని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి వివరణ ఇచ్చారు.బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఒక్కడి కోసం అందరు కలిసి,అందరి కోసం ఒక్కడు నిలిచి అన్న మహాకవి శ్రీశ్రీ మాటల ప్రకారం రాష్ట్ర ప్రజలు అందరూ నమ్మి జగన్‌మోహన్‌రెడ్డిని సిఎం చేశారు.నేడు అన్ని ప్రాంతాలవారు అభివృద్ధి చెందాలనే మంచి ఉద్దేశ్యంతో అధికార వికేంద్రీకరణ ఉండాలని మూడు రాజధానుల ఆలోచన చేశారని అన్నారు. అభివృద్ధి అనేది ఒక ప్రాంతానికి,ఒక వర్గానికి పరిమితం కాకూడదనేది సిఎం అభిమతమన్నారు.ఈ ఆలోచన కొత్తదేమీ కాదని,1937లో అప్పటి శ్రీ భాగ్ ఒప్పందం ప్రకారమే రాయలసీమ ప్రాంత అభివృద్ధి కోసం నేడు సిఎం జగన్ ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.వాస్తవానికి రాష్ట్రం విడిపోయాక 13 జిల్లాల ఆంధ్రప్రదేశ్‌లో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చేయాలన్న ఆలోచన అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి ఉండాలి. అలా కాకుండా ఎంతో మంది మేథావులు అమరావతిలో రాజధాని వద్దన్నా కొందరి ఆర్థిక,సామాజిక,రాజకీయ ప్రయోజనం కోసం చంద్రబాబు అమరావతికి పట్టం కట్టారు. రాయలసీమ ప్రాంతం అభివృద్ధి చెందడానికి,న్యాయ రాజధానిని సాధించుకోవడానికి ఈనెల 29న స్థానిక కృష్ణాపురం ఠాణా నుండి మున్సిపల్ ఆఫీసు వరకు రాయలసీమ ఆత్మగౌరవ మహా ప్రదర్శన చేస్తున్నామన్నారు.ఈ మహా ప్రదర్శన కేవలం తిరుపతిలో మొదటగా శ్రీకారం చుట్టామని,తమను చూసి రాష్ట్రంలోని అన్ని జిల్లాల ప్రజలు ముందుకు వచ్చే అవకాశం ఉందన్నారు.రాయలసీమ అభివృద్ధి కోసం తాము చేస్తున్న ఈ మహా ప్రదర్శన యాత్రలో మూడు రాజధానులను సమర్థించే ప్రతి ఒక్కరు ఆహ్వానితులేనన్నారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ,స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్కే.బాబు,పాలగిరి ప్రతాపరెడ్డి,దొడ్డారెడ్డి సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల శవ రాజకీయాలు



గంగకాలువలో తేలుతున్న మహిళ మృతదేహం

## పేదల కడుపు కోత పట్టించుకోని వైనం!
## 6 రోజులుగా ఏరియా ఆసుపత్రి శవాగారంలో కుళ్ళుతున్న శవం!!

**సామాన్యులకు పోలీసుల సేవలు దూరమౌతున్నాయి. పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు కావాలన్నా కాకూడదన్నా రాజకీయ నాయకుల సిఫార్సులు ఉండాల్సిందే అన్నట్లు మారింది.శ్రీకాళహస్తికి సంబంధించిన ఓ కేసు విషయంలో పోలీసులు సరిహద్దుల వివాదంతో కనీసం కేసు నమోదు చేయలేదంటే పోలీసు శాఖ సామాన్యులకు ఏ మాత్రం అందుబాటులో ఉందో ఇట్టే అర్థమౌతుంది.**

శ్రీకాళహస్తి,అక్టోబర్ 26 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణంలోనిఎన్‌టి ఆర్ నగర్‌లో నివాసముంటున్న లలిత,ఠాగూర్‌ల కుమార్తె చంద్రిక ఇంటర్‌చదువుతోంది. చంద్రిక తల్లి స్వస్థలం శ్రీకాళహస్తి మండలంలోని రామాపురం. అయితే అక్కడ ఓ సారి చంద్రిక ప్రవర్తన సందేహాస్పందం కాగా లలిత,ఠాగూరు కాపురాన్ని శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్‌టిఆర్ నగర్‌కుమార్చారు. చంద్రికకు వారి బంధువుల ఇళ్ళ వద్ద మార్చారు. దొరవారి సంత్రం వద్దకు మకాం మార్చారు. ఈ ఏడాది సంక్రాంతి పండగ తరువాత వివాహం చేయాలని నిర్ణయించారు. అయితే జనవరి 9న చంద్రిక కనబడలేదు.దాంతో తల్లిదండ్రులు అక్కడ పోలీసుకు ఫిర్యాదు చేసారు. అప్పటి నుంచి తమ కుమార్తె కోసం గాలిస్తున్నారు.ఈ నేపథ్యంలో అప్పటి నుంచి రామాపురం గ్రామానికి చెందిన వాలంటీర్ చంద్రశేఖర్ అనే చంద్ర కూడా కనబడటం లేదు.గతంలో కూడా వారిద్దరికి సంబంధం ఉన్నట్లు వివాదాలు చోటు చేసుకున్నాయి. చంద్రశేఖర్‌కు వివాహమై ఓ బిడ్డ కూడా ఉన్నాడు.

### జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు:

ఈ వివాదాలకు సంబంధించి ఈ నెల 22న చంద్రిత తల్లిదండ్రులు ఠాగూర్ ఆతని భార్య లలిత జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేసారు.వారి పిర్యాదుమేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఠాగూర్‌కు ఓ కుమారుడు, ఓ కుమార్తె సి.చంద్రిత అనే వారు. చంద్రిత ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదివి జూనియక్ ఇంటర్‌ను శ్రీకాళహస్తిలో మహిళా జూనియర్ కళాశాలలో ఇంటర్ చేరింది.సెలవు రోజుల్లో వారి అమ్మమ్మ ఇంటికి రామాపురం వెళ్ళి వచ్చేది.ఈ సమయంలో గద్దె చంద్ర అనే వాలంటీర్ మాయమాటలతో లొంగదీసుకున్నట్లు గత ఏడాది దీపావళి మరుసటి రోజు నుంచి పరారయ్యారని పేర్కొన్నారు.దాంతో తమ బిడ్డను చంద్ర కిడ్నాప్ చేసాడని శ్రీకాళహస్తిలోని వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు.ఈ సంఘటనలో గ్రామానికి చెందిన బాల్‌రెడ్డి అను వ్యక్తి ప్రోద్బలంతో వెళ్ళినట్లు చేసిన ఫిర్యాదుతో బాల్‌రెడ్డి, చంద్ర తమ బిడ్డను మదనపల్లి నుంచి తీసుకొచ్చి పోలీసు స్టేషన్‌లో అప్పగించినట్లు వివరించారు. దాంతో ముందుజాగ్రత్తగా మైలాంగం గ్రామంలో నివాసముంటున్న బంధువు సుగుణ వదలి పెట్టామన్నారు. పది రోజుల తరువాత ఈ ఏడాది జనవరి 10న చంద్రిత కనబడటం లేదని తమకు ఫోన్‌ద్వారా తెలియజేసారు.తాము చంద్ర కోసం వెతక్కగా ఆతను ఒకూడా కనబడలేదని తెలియటంతో జనవరి 11న అక్కడ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు ఫిర్యాదును కెవిబిపురం పోలీసులకు కూడా వివరించారు.

### ఆరురోజులుగా కుళ్ళుతున్న శవం:

ఈ నెల 21న తెలుగుగంగ కాలువ కెవిబిపురం మండలంలోని కోవనూరు వద్ద ఓ గుర్తుతెలియని సుమారు 17 సంవత్సరాల యువతి శవం కనబడటంతో చంద్రిక తల్లిదండ్రుల వద్ద ఉన్న గుర్తులను బట్టి ఆ శవం తమ బిడ్డదే అని చెబుతున్నారు. అయితే తన బిడ్డ మృతికి కారణమైన వానిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు పట్టుబట్టారు.కానీ ఈకేసులో బాధితులఫిర్యాదుమేరకు అధికార పార్టీకి చెందిన ఓ నాయకునిపై చేయటంతో పోలీసులు సందిగ్ధంలో పడ్డారు.బిడ్డ శవం తమదే అంటూ మొరబెట్టుకుంటుంటే డిఎన్‌ఏ రిపోర్టు వచ్చిన తరువాత కానీ నిర్ధారించలేమంటూ పోలీసులు కేసును నీరు గార్చుటకు ప్రయత్నించటంతో వివాదాలు చోటు చేసుకున్నాయి.

# స్మార్ట్ సిటీ ప్రాజెక్టులను వేగవంతం చేయాలి

## ఎండి అనుపమ అంజలి



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 26, ప్రభాతవార్త

తిరుపతి స్మార్ట్ సిటీ ప్రాజెక్టులను వేగవంతం చేయాలని తిరుపతి స్మార్ట్ సిటి ఎండి, తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. దేశంలోని స్మార్ట్ సిటీలతో బుధవారం స్మార్ట్ సిటీ మిషన్ జాయింట్ సెక్రటరీ, మేనేజింగ్ డైరెక్టర్ కునల్ కుమార్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తిరుపతి స్మార్ట్ సిటి నుండి ఎంపిడి అనుపమ అంజలి పాల్గొని చర్చించారు. అనంతరం స్మార్ట్ సిటి ఎండి అనుపమ అంజలి మాట్లాడుతూ తిరుపతి నగరంలో చేపట్టిన ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ నూతన భవనంతో కలిపి సిటీ ఆపరేషన్ సెంటర్ బిల్డింగ్ నిర్మాణం పనులు త్వరగా చేపట్టేలా చూడాలన్నారు. తిరుపతి రైల్వే పార్శిల్ ఆఫీస్ ఎదురుగా నిర్మించబోయే మల్టీ లెవల్ కార్ పార్కింగ్ కోసం గత సమావేశంలోనే పెరిగిన అంచనా వ్యయంపై చర్చించి ఆమోదించడం జరిగిందని గుర్తు చేస్తూ పనులు చేపట్టే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. శ్రీనివాససేతు పనులు 85 శాతం పూర్తి కావడాన్ని ప్రసంసిస్తూ మిగిలిన పనులు పూర్తికి కృషి చేయాలన్నారు. సకాలంలో పనులు పూర్తి చేసి దేశంలోనే తిరుపతి స్మార్ట్ సిటికి మంచి పేరు ప్రత్యేకతలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో స్మార్ట్ సిటి ఎస్ఈ మోహన్, ఏఓ రాజశేఖర్, సిఎఫ్ఓ మల్లిఖార్జున్, డిఈ మోహన్,సిబ్బంది పాల్గొన్నారు.

## ఉష్ణోగ్రతలు

26/10/2022



- తిరుపతి 33 డిగ్రీలు
- చిత్తూరు 35 డిగ్రీలు
- మదనపల్లి 28 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 34 డిగ్రీలు
- వెంకటగిరి 34 డిగ్రీలు
- గూడూరు 35 డిగ్రీలు

## బంగారం ధరలు

26/10/2022



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 4,740

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,172

## కోడిగ్రుడ్ల ధరలు

26/10/2022



కోడిగ్రుడ్డు :రూ.6.00

1 డజను: రూ.72.00

# 100కోట్ల రూపాయల నిధులకై ప్రతిపాదనలు !!

- గ్రామాల్లో అభివృద్ధి పనులకు సర్పంచుల ప్రణాళికలు

కుప్పం, అక్టోబర్ 26 ప్రభాతవార్త



కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో అభివృద్ధి పనులకు గత నెలలో కుప్పం పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ కోరిక మేరకు 100కోట్ల రూపాయల నిధులు మంజూరుచేస్తానని హామీ ఇచ్చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఈ నిధులు కుప్పం గ్రామీణ, శాంతిపురం, గుడుపల్లె, రామకుప్పం మండలాల్లోని 89 పంచాయతీలకు కేటాయించనున్నారు. దీంతో ఈ నిధులు త్వరలో మంజూరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో గ్రామ పంచాయతీల సర్పంచులు ఆ నిధులతో గ్రామాల్లో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ప్రణాళికలు, నివేదికలను సర్పంచులు రూపొందించారు. గ్రామాల్లో ప్రధానంగా నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలకు సర్పంచులు ఈ నిధుల ద్వారా పనులు చేపట్టాలని ప్రతిపాదనలు సిద్ధం చేసుకున్నారు. ఒక్కో మండలానికి 25 కోట్ల మేర నిధులను కేటాయించనున్నారు. దీంతో ఆయా మండలాల్లో గల పంచాయతీలకు వంద కోట్ల నిధులు మంజూరైతే మరింత అభివృద్ధి చెందనున్నాయి. ఈ నిధులు మంజూరైతే మూడేళ్ల అనంతరం పెద్ద ఎత్తున గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. ఈ వంద కోట్ల నిధులకోసంపంచాయతీసర్పంచులుఎంతోఆశగా ఎదురుచూస్తున్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఎమ్మెల్సీ భరత్ ఆదేశాలతో బస్సు సౌకర్యం

కుప్పంరూరల్, అక్టోబర్ 26 ప్రభాతవార్త

కుప్పం మున్సిపల్ పరిధి నారాయణపురం గ్రామంకు చిత్తూరు ఎమ్మెల్సీ కెఆర్‌జె భరత్ ఆదేశాల మేరకు ఆర్టీసీ బస్సును మంగళవారం నుంచి నడుపుతున్నట్లు డిపో మేనేజర్ టిబి స్వామి తెలిపారు. ఈ బస్సు రోజూ ఉదయం కుప్పం నుంచి 7గంటలకు బయలుదేరి 7.30గంటలకు నారాయణపురం వెళ్లనున్నారు. అక్కడనుంచి మరలా కుప్పంకు7.50గంటలకు చేరుతుందన్నారు. సాయంత్రం కుప్పం నుంచి 5గంటలకు బయలుదేరి 5.25గంటలకు చేరుతుందని అనంతరం కుప్పంకు తిరుగు ప్రయాణంలో 5.40గంటలకు చేరుతుందన్నారు. ప్రజలు, విద్యార్థులు ఈ బస్సుసౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## చురుగ్గా ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కార్యక్రమం

రామకుప్పం, అక్టోబర్ 26 ప్రభాతవార్త



మండలంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల నమోదు కార్యక్రమును తెలుగు దేశం పార్టీ నేతలు చురుగ్గా చేపడుతున్నారు. పంచాయతీల్లో పార్టీ నేతలు ఇంటింటా తిరిగి పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునేలా కృషి చేస్తున్నారు. అలాగే ఎన్నికల్లో తెదేపా అభ్యర్థి డా. శ్రీకాంత్‌ను గెలిపించాలని ప్రచారం చేస్తున్నారు.దేశం నేతలు ఆంజనేయరెడ్డి, శ్రీరాములురెడ్డి, టివి రవి, మంజునాథ్, రఘు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు టిఎఆర్‌ఎల్ శిక్షణ కార్యక్రమం

శాంతిపురం, అక్టోబర్ 26 ప్రభాతవార్త



ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక హైస్కూల్‌లో టీచింగ్ అట్ రైట్ లెవెల్ శిక్షణ కార్యక్రమంను రెండో విడతనిర్వహిస్తున్నారు.కార్యక్రమంకుడివైఇఓ చంద్ర శేఖర్ హాజరై శిక్షకులకు, రిసోర్స్ పర్సన్లకు తగు సూచలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఇఒ చంద్రశేఖర్ పాల్గొన్నారు. అనంతరం హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను సందర్శించారు.

## యువతి ఆత్మహత్య

శాంతిపురం, అక్టోబర్ 26 ప్రభాతవార్త



శాంతిపురం మండలం రాళ్లబూదుగూరుకు చెందిన సుచిత్ర (18) బుధవారం బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెందిన రామూర్తి కుమార్తె సుచిత్ర ప్రేమ వ్యవహారం కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు రాళ్లబూదుగూరు ఎస్సై మునస్వామి తెలిపారు.

## శాంతిపురంకు 600 పక్కా ఇళ్లు మంజూరు - జడ్పీటిసి శ్రీనివాసులు

శాంతిపురం, అక్టోబర్ 26 ప్రభాతవార్త



శాంతిపురం మండలంలోని 23 పంచాయతీలకు 600 పక్కా ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని జడ్పీటిసి శ్రీనివాసులు, ఎంపిపి వసుంధర కోదం డరెడ్డి పేర్కొన్నారు. బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచులు ఆయా పంచాయతీలకు కేటాయించిన గృహాలను అర్హులైన లబ్దిదారులకు కేటాయించి పనులు ప్రారంభించాలని కోరారు. గ్రామాల్లో సైతం పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నేతలు దండపాణి, చక్రపాణిరెడ్డి, ఎవి జయరాం,పిఎసిఎస్ ఛైర్మన్ మునిరత్నంగౌడు, శ్రీరాములు, పట్టాభి, రఘురాంరెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

## విజయవాడకు తరలిన కుప్పం తెలుగు తమ్ముళ్లు !!

కుప్పం, అక్టోబర్ 26 ప్రభాతవార్త

తెదేపా అధినేత, ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడును కలసేందుకు కుప్పంకు చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ నేతలు విజయవాడకు బుధవారం పయనమయ్యారు. గురువారం కుప్పం నియోజకవర్గంలోని మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, ఇటీవల కేసులతో బెయిల్‌పై జైలునుంచి విడుదలైన పలువురు తెదేపా నేతలతో పార్టీ అధినేత చంద్రబాబు సమావేశం నిర్వహించను న్నారు. కుప్పంలో పార్టీ పరిస్థితులపై చర్చించడంతో పాటు కుప్పం పర్యటనపై సైతం చంద్రబాబు నాయుడు నేతలతో చర్చించనున్నట్లు సమాచారం.

## నాలుగు సబ్‌స్టేషన్లు మంజూరు

సదుం, అక్టోబర్ 26 ప్రభాతవార్త

మండలానికి నాలుగు విద్యుత్ సబ్‌స్టేషన్‌లు మంజూరైనట్లు జడ్పీ మాజీఉపాధ్యక్షుడుపెద్దిరెడ్డితెలిపారు. బుధవారం ఆయన ఈమేరకు అధికారులతో కలసి స్థలపరిశీలన జరిపారు. ఊటుపల్లె, ఉప్పరపల్లె, తాటిగుంట పాలెం, ఎర్రా"హారంలకు వీటిని విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంజూరు చేశారని చెప్పారు. త్వరలో నిర్మాణం ప్రారంభించి పనులు పూర్తి చేసి నాణ్యమైన విద్యుత్‌ను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాన్స్‌కోఅధికారులుచెప్పారు. జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి, ఈఈ కృష్ణారెడ్డి, ఏఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ఖరీఫ్ పంటపై అవగాహన

రొంపిచర్ల,అక్టోబర్ 26 ప్రభాతవార్త



రొంపిచర్ల మండలంలోని బండకింది పల్లి, బొమ్మయ్యగారి పల్లి,తదితర గ్రామాల్లో బుధవారం పీలేరు డివిజన్ సహాయకులు డై.వి రమణా రావు, రైతులకు ఖరీఫ్ పంట సాగు పై అవగాహన కల్పించారు. ఖరీఫ్ పంట వివిధ్యం,జలధార, పై వివరించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వివిధ పధకాల రైతులకు చేరాలంటే ప్రతి రైతుతనపంట ను ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ ధికారిణి జి.సుధారాణి,ఎఇఒ, ఖాదర్ వల్లి, ఆర్‌బికె ఇంచార్జ్,ఎం.సుజాతమ్మ, నర్సు,సి.శ్రావణి, వెంకట నాయక్,తదితరులు పాల్గొన్నారు.

## నడిగడ్డలో ఆధార్ కేంద్రం ప్రారంభం

సదుం,అక్టోబర్26 ప్రభాతవార్త

మండల పరిధిలోని నడిగడ్డ గ్రామ సచివాలయంలో బుధవారం నుంచి ఆధార్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ ఆధార్ కేంద్రాన్ని సర్పంచ్ నారాయణరెడ్డి ప్రారంభించారు. నడిగడ్డ, రెడ్డివారిపల్లె గ్రామాలకు సంబంధించిన వారికి ఈ ఆధార్ కేంద్రం అందుబాటులోకి వచ్చిందని ఆయా పంచాయతీల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అదేవిధంగా ఆధార్ కొత్తగా నమోదు చేసుకోవాలన్నా, మార్పులు చేర్పులు చేసుకోవాలన్నా ఇక్కడ చేసుకోవచ్చునని చెప్పారు. సచివాలయ కార్యదర్శి అనిల్,సిబ్బంది వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత - ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

బంగారుపాళ్యం, అక్టోబర్ 26 ప్రభాతవార్త:



చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి కొత్తపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద టెంపో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంను బుధవారం బంగారుపాళ్యం పోలీసులు పట్టుకొన్నారు. యాదమరి నుండి బెంగళూరుకు 118బస్తాల్లో5,900 కేజీల రేషన్ బియ్యంను తరలిస్తూ ఇద్దరు పోలీసులకు పట్టుబడ్డారు. యాదమరి గ్రామంకు చెందినఅబ్దుల్‌సలాం, పలమనేరుకుచెందినసర్దార్‌లనుపోలీసులుఅరెస్టుచేశారు. ఈ మేరకు బంగారుపాళ్యం ఇన్స్‌పెక్టర్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పక్కాగా ఈ-క్రాప్ నమోదు

పాలసముద్రం, అక్టోబర్ 26 ప్రభాతవార్త:

పంట సాగు చేసిన రైతులకు సంబంధించి పంట సాగు వివరాలను పక్కాగా ఈ-క్రాప్ నమోదు చేస్తేనే ప్రభుత్వం ద్వారా రైతుకు లబ్ది చేకూరుతుందని నగరి అర్డీఓ సుజన అన్నారు. ఈ-క్రాప్ నమోదు వివరాలను ఆమె బుధవారం పాలసముద్రం, శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయాల పరిధిలో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు సాగు చేసిన పంట వివరాలను పక్కాగా ఈ-క్రాప్ కింద నమోదు చేసుకోవాలన్నారు. ఇలా చేయడం ద్వారా రైతులకు ప్రభుత్వం కల్పించే సబ్సిడీ, ఇతర సదుపాయాలు వర్తిస్తాయన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ సుజన పాలసముద్రం తహసిల్దారు కార్యాలయంను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు బాబు, ఎంపిడిఓ విద్యావతి, అగ్రికల్చర్ఆఫీసర్ ఢిల్లీ బాబు, విఆర్ఓ తంగరాజు, సర్పంచ్ మహేష్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బొబ్బిలి వాలీబాల్ పోటీలకు జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక పూర్తి

పుంగనూరు, అక్టోబర్ 26 ప్రభాతవార్త :



విజయనగరం జిల్లా బొబ్బిలిలో జరిగే అంతర్‌జిల్లా వాలీబాల్ పోటీలకు గాను పుంగనూరులో బుధ వారం జరిగిన జిల్లా వ్యాప్త బాలబాలిక క్రీడాకారుల ఎంపిక పూర్తయింది. బాలురకు సంబంధించి జిల్లా వ్యాప్త పాఠశాలల నుంచి 70 మందికి గాను 16 మంది,బాలికల జట్టుకుగాను 50 మంది పాల్గొనగా వారిలో 17 మంది ఎంపికయ్యారు.జిల్లా వాలీబాల్ అసోషియేషన్ అధ్యక్షుడు తులసిరెడ్డి,కార్యదర్శి కృష్ణా రెడ్డిల సమక్షంలో జరిగిన ఈఎంపికలో ముఖ్యఅతిథులుగా విశ్రాంత డిఎస్పీ కనుమకుంట సుకుమార్ బాబు,నానబాలగణేష్,నౌషాద్‌లతో పాటు సీనియర్లు కూడా పాల్గొన్నారు. ఈసందర్భంగా కార్యదర్శి కృష్ణారెడ్డి మాట్లాడుతూ వాలీబాల్ రంగంలో జిల్లా ఖ్యాతిని దేశస్థాయికి తీసుకువెళ్లి జాతీయస్థాయిలో పోటీలలో పాల్గొన్న సీనియర్ల బాటలో జిల్లా జట్లను తీర్చిదిద్దడానికి కృషిచేస్తున్నామన్నారు. రాష్ట్రమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,ఎంపిలు మిదున్‌రెడ్డి,రెడ్డెప్పలతో పాటు స్థానికుల సహకారంతో ఎంపిక నిర్వహించామని తెలిపారు.

## త్వరితంగా జగనన్న కాలనీల పనులు

పూతలపట్టు, అక్టోబర్ 26 ప్రభాతవార్త:



జగనన్న కాలనీల్లో పనులను త్వరితంగా పూర్తి చేయాలని ఎంపిడిఓ గౌరి అధికారులను ఆదేశించారు. ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం ఎంపిడిఓ గౌరి సచివాలయ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ మాట్లాడుతూ మండల పరిధిలో జగనన్న కాలనీల్లో జరుగుతున్న పనులను మరింత వేగవంతం చేసి త్వరితంగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ డిఇఓ సుబ్రమణ్యం, ఎఓ చంద్రశేఖర్, ఇఓఆర్డీ సుశీల, హౌసింగ్ ఎఇ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## మున్నూరు కాపులను బిసీ డి జాబితాలో చేర్చడం ప్రభుత్వ కుట్ర

పాలసముద్రం, అక్టోబర్ 26 ప్రభాతవార్త:



మున్నూరు కాపులను బిసి డి జాబితాలో చేర్చుతూ ప్రభుత్వం జిఓ జారీ చేయడం బీసీ కులాలపై ప్రభుత్వం కుట్ర చేసిందని 139 బీసీ కులాల అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచంద్రయాదవ్ ధ్వజమెత్తారు. పాలసముద్రంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ బీసీ కులాలను దెబ్బతీసే విధంగా ప్రభుత్వం మున్నూరు కాపులను బీసీ జాబితాలో చేర్చి బీసీలకు అన్యాయం చేసిందని ఆరోపించారు. బీసీలకువిద్య, ఉద్యోగరంగాల్లో ఇప్పటికే అన్యాయం జరుగుతుందని, అలాగే రాజకీయ రంగంలో బీసీలకు తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. ఇకపై ప్రతి కాపు కులస్తుడు మున్నూరు కాపు పేరిట బీసీ సర్టిఫికేట్‌ను పొందుతారని ఆయన ఆరోపించారు. గతంలో కాపులను బీసీల్లో చేర్చవద్దని పెద్ద ఉద్యమం చేస్తే గత ప్రభుత్వం వెనకడుగు వేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం దొడ్డిదారిలో మున్నూరు కాపులను బీసీ జాబితాలో చేర్చుతూ జిఓ జారీ చేసిందన్నారు. రానున్న రోజుల్లో బీసీలు ఉద్యమానికి సిద్ధం కావాలని సత్వరం మున్నూరు కాపులను బీసీ జాబితా నుండి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

## కోడి పందెరాయుళ్లు అరెస్ట్

రొంపిచర్ల.అక్టోబర్,26 ప్రబాతవార్త

రొంపిచర్ల మండలంలోని పెద్దమల్లెల గ్రామ పంచాయతీలోని పాతపాళ్యెం లో బుధవారం కోడి పందెం ఆడుతున్నఏడుమందినిఅరెస్ట్‌చేశామనిఎస్ఐ.శ్రీనివాస్ తెలిపారు. ఆప్రాంతంలో కోడి పందెళ్లు నిర్వహిస్తున్న సమాచారంమేరకుదాడులుచేశామనిఆమేరకువారి నుంచి రూ 5.550 నగదును స్వాదీనం చేసుకున్నామని పేర్కొన్నారు. నిందితులకు స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపినట్లు తెలిపారు. మండంలోని ఎక్కాడైన జూదం, నాటుసారా తయారు చేయడం, విక్రయాలు జరుపడం పై ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ శ్రీనివాస్ సూచించారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## రక్తదాన శిబిరం విజయవంతం

సూళ్లూరుపేట, అక్టోబర్ 26 ప్రభాతవార్త

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వారి సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని గూడూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. రక్తదాన శిబిరానికి శ్రీగోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు పెద్దఎత్తున హాజరై రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లురెడ్డి, ఎస్ఐలు రవిబాబు, శ్రీనివాసులురెడ్డి, జిలానిలు పాల్గొన్నారు.

## శ్రీనాగేశ్వరస్వామికి ప్రత్యేక అలంకారం

సూళ్లూరుపేట, అక్టోబర్ 26 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని శ్రీనాగేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక మాసం ప్రారంభోత్స వాన్ని పురస్కరించుకొని స్వామివారికి బుధవారం ప్రత్యేక అలంకారం చేశారు. ఉదయం నుంచి మహిళలు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి దీపాలు వెలిగించారు. ప్రతి సోమవారం స్వామివారికి ప్రత్యేక అలంకారంతో పాటు పూజలు చేయనున్నట్లు ట్రస్టుబోర్డు వారు తెలిపారు.

## ఆటోడ్రైవర్లు క్రమశిక్షణతో మెలగాలి

- అర్బన్ సీఐ సీహెచ్ ప్రభాకర్‌రావు

నాయుడుపేట రూరల్, అక్టోబర్ 26 ప్రభాతవార్త



నాయుడుపేట ప్రాంతంలోని ఆటోడ్రైవర్లు క్రమశిక్షణతో మెలగాలని అర్బన్ సీఐ సీహెచ్ ప్రభాకర్‌రావు సూచించారు. బుధ వారం నాయుడుపేట బస్టాండ్ సమీపంలోని మల్లాం ఆటో స్టాండ్ ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథిగా అర్బన్ సీఐ సీహెచ్ ప్రభాకర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోర్డు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ పట్టణంలోని ఆటో డ్రైవర్లు క్రమశిక్షణతో మెలగాలని, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఆటోలను నడుపుకోవాలని సూచించారు. ఆటోడ్రైవర్లు లైసెన్సులు, బ్యాడ్జిలు కలిగి ఉండాలని సూచించారు. అనంతరం ఆటోడ్రైవర్లు సీఐ ప్రభాకర్‌రావును పూలమాలలతో సత్కరించి శాలువాలతో సన్మానించారు. ఆటోయూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు తంజావూరు మ ఉరళీ సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికులు ఐక్యంగా ఉండాలని, ఆటో కార్మికుల సమస్యల పరిష్కారంలో సీఐటీయూ సహకారం ఉంటుందని తెలిపారు. దేశంలో ఎంతోమంది ఉపాధి లేక ఆటోడ్రైవర్లుగా మారుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరగడం వల్ల ప్రజారవాణాలో అనేక మార్పులు సంభవిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మునిరాజా, సీఐటీయూ మండల కార్యదర్శి శివకవి ముకుందా, సీఐటీయూ మేనకూరు క్లస్టర్ కన్వీనర్ చాపల వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షులు మహేష్, ఆటో యూనియన్ నాయకులు జనార్ధన్, హరి, కార్‌స ట్టాండ్ యూనియన్ నాయకులు సాగర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## పంట పొలాల్లో ఆర్డీఓ ఈ-క్రాప్ పరిశీలన

ఓజిలి, అక్టోబర్ 26 ప్రభాతవార్త



రైతులందరూ ఈకేవైసీ చేసుకుంటే ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు పొందవచ్చని ఆర్డీఓ రోజ్‌మాండ్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని పున్నేపల్లి, గ్రద్దగుంట, జోస్యులవారికండ్రిగ గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతుల పొలాలను ఆర్డీఓ తనిఖీ చేశారు. ఆర్‌బీకేలలో గల వ్యవసాయ శాఖ సహాయకులు తప్పకుండా ఈ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని పొలాల వద్దకు వెళ్లి నిర్వహించాలని ఆర్డీఓ సూచించారు. వ్యవసాయ శాఖ సహాయకులు నమోదు చేసిన ఈ-క్రాప్ వివరాలు క్షేత్రస్థాయిలో ఆయా రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలు ఒక్కటిగా ఉన్నాయా లేదా గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. పంట పొలాలను ఈ-క్రాప్‌లో నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రైతులతో మాట్లాడుతూ రైతులందరూ ఈకేవైసీ చేయించుకుంటే ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు అందుతాయని తెలిపారు. కావుల రైతులందరూ తప్పకుండా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈకేవైసీ ద్వారా పంటల బీమా వర్తిస్తుందని, సున్నావడ్డీ పంటరుణాలు వర్తిస్తాయని పంట నష్టపరిహారం రైతులకు అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ డి.లాజరస్, మండల సర్వేయర్ ఎం.గోపిరెడ్డి, మండల వ్యవసాయ అధికారులు, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# వామ్మో జ్వరాలు !

## వణికిపోతున్న ప్రజలు, పట్టించుకోని వైద్యఆరోగ్యశాఖ అధికారులు

కోట, అక్టోబర్ 26 ప్రభాతవార్త

వాతావరణంలో మార్పులతో వ్యాపిస్తున్న వైరల్ జ్వరాలతో పాటు డెంగీ, మలేరియా ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం, వర్షపు నీటి నిల్వలతో దోమలు విజృంభించి ప్రజలను వ్యాధుల బారిన పడేలా చేస్తున్నాయి. అక్కడక్కడ ప్రాణాలను సైతం హరిస్తున్నాయి. జ్వరపీడితులను ఆదుకోవాల్సిన వైద్య ఆరోగ్య శాఖ ప్రమాదాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వర్షాలొస్తే జ్వరాలు రావడం సహజం. జ్వర పీడితులు ఏయే ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటారో కూడా యంత్రాంగం వద్ద రికార్డులు కూడా ఉంటాయి. ఈ జాబితాల ఆధారంగా జ్వరాలునివారణకు గట్టి చర్యలు తీసుకోవాల్సి ఉన్నా ప్రభుత్వ శాఖలుచోద్యంచూస్తున్నాయి. మలేరియా, డెంగీ విజృంభిస్తు న్నాయి. యంత్రాంగంలో కదలిక లేకపోవడంతో విమర్శలు వినిపిస్తున్నాయి.



గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్యం పట్టు తప్పినా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. పంచాయతీల్లో నిధుల సంక్షోభంతో మురుగు కాలువల్లో పూడికతీత, దోమల నివారణచర్యలుమొక్కుబడిగామారాయి.నీటికలుషితాలను గుర్తించాల్సిన ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ..అంతాబాగున్నట్లు రికార్డుల్లో నమో దు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలు ఉండడంతోదోమలువృద్ధి చెందిజ్వరాలను పెంచుతున్నాయి. ఇంటా..బయటానీటినిల్వలు ఉంటే డెంగీ కోరి తెచ్చుకున్నట్లే. అటు జిల్లా వ్యాప్తంగా పారిశుద్ధ్యంలోపించిన ప్రాంతాల్లో కనీసం బ్లీచింగ్ చల్లడానికి నిధుల్లేవు .ఇంత జరుతున్నా పంచాయతీ, వైద్య ఆరోగ్యశాఖఅధికారులు మొక్కుబడిగా సమీక్షలతో సరిపెడుతున్నారనే విమర్శలువెల్లువెత్తున్నాయి. దీనికి తోడు వివిధ శాఖల మధ్య సమన్వయంకొరవడింది.దీంతో రోగులతో ప్రవేటు ఆసుపత్రులు కిటకిటాలాడుతున్నాయి.

**డాక్టర్ వివరణ:** మండలంలో టైఫాయిడ్ జ్వరాలు ఉన్నాయని ప్రజలు కాచిన నీళ్లు తాగాలని, గోర్లు కత్తిరించుకోవాలని, చిట్టేడు ఉప కేంద్రం వైద్యాధికారి నాగరాజు సూచించారు. నీళ్లు ఎక్కడా నిల్వ ఉండకూడన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఆరోగ్య విషయంలో ప్రజలు నిర్లక్ష్యంగా వద్దన్నారు.

## శ్రీరామ్ గురవయ్య మృతి

- నివాళి అర్పించిన ఎమ్మెల్యే వరప్రసాదరావు

కోట, అక్టోబర్ 26 ప్రభాతవార్త



కోట మండలం కేశవరం సర్పంచ్ గురుస్వామి తండ్రి శ్రీరామ్ గురవయ్య బుధవారం కన్నుమూశారు. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. సమాచారం తెలుసుకున్న గూడూరు ఎమ్మెల్యే వరప్రసాదరావు గురవయ్య భౌతికకాయానికి నివాళి అర్పించారు. అదేవిధంగా కోటమ్మ ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, చిట్టేడు సొసైటీ ఛైర్మన్ ఉలవకాయల ప్రసాద్, వైసీపీ నాయకులు ఎం.రాజేంద్ర తదితరులు గురవయ్య భౌతికకాయానికి నివాళి అర్పించారు. గురవయ్యను కడసారి చూసేందుకు ఆ ప్రాంతప్రజలు తరలివచ్చారు. గురుస్వామిని పరామర్శించి కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు.

## కార్తిక మాసం ప్రారంభం

కోట,అక్టోబర్ 26 ప్రభాతవార్త

పరమ శివుడు, శ్రీమహావిష్ణువులకు ఇష్టమైన కార్తిక మాసంలో ప్రతి ఒక్కరు దేవాలయాన్ని దర్శించుకుని పూజులు జరిపిస్తారు. తాము కోరుకున్న పనులు ముందుకు సాగాలని అనేక రకాల యాగాలు, హోమాలు, పూజలు జరిపిస్తారు.కోట మండలంలోని గూడలి కోండ పై వెలిసిన శ్రీభీమశ్వరస్వామి కొండపై , కార్తిక మాసంలో పూజలు నిర్వహించడానికి ఇష్టపడతారు. ఇక్కడ స్వర్ణముఖి నధిలో స్నానం చేసి పూజలు జరిపిస్తే అని శుభాలు కలుగతాయని భక్తులు నమ్మకం. కార్తిక మాసంలో స్వామి వ్రతాలు నిర్వహించడానికి ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు.నేదురుమల్లి పౌండేషన్ దాతృతంతో ప్రతి ఏటా గూడలి కోండపై ప్రత్యేక వేడుకలను నిర్వహిస్తారు.

## ఆర్టీసీ బస్టాండ్‌లోకి పంచాయతీ మురుగునీరు

కోట, అక్టోబర్ 26 ప్రభాతవార్త



కోట ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలోకి పంచాయతీలోని వివిధ నివాసాల వారు మురికినీటిని వదులు తున్నారు. దీంతో బస్సుల కోసం వేచిచూసే ప్రయాణికులు దుర్వాసన భరించలేక ముక్కు మూసుకోవాల్సి వస్తోంది. కోట మేజర్ పంచాయతీలో గత 40 ఏళ్లుగా సరైన డ్రైనేజి వ్యవస్థ లేకపోవడంతో మురికినీరు కాలువల్లోకి వదలడంతో ఆ కాలువల్లో నుంచి మురికినీరు నేరుగా బస్టాండు ప్రాంతంలోకి చేరుతోంది. దీంతో ఆ మురికి గుంటల్లోకి పందులు,పశువులు చేరుతున్నాయి. దోమలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.ఆర్టీసీస్థలం అంటే పంచాయతీఅధికారులకుఅంతచులకనా అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. కార్యదర్శి వివరణ పంచాయతీ మురికినీరు ఆర్టీసీ ప్రాంగణంలోకి ఎలా వదులుతారని కార్యదర్శి శ్రీనివాసులును 'ప్రభాత వార్త' వివరణ కోరగా, తన దృష్టికి రాలేదని విచారించి ఆర్టీసీ ప్రాంగణంలోకి మురికినీరు వెళ్లకుండా చూస్తామన్నారు.

## 27న సబ్‌స్టేషన్‌లో వాహనాలు వేలం

వాకాడు, అక్టోబర్ 26, ప్రభాతవార్త

మద్యం తరలిస్తూ అక్రమంగా పట్టుబడిన వాహనాలను ఈ నెల 27న సబ్ స్టేషన్‌లోని బహిరంగంగా వేలం వేస్తున్నట్లు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్ ప్రసన్న లక్ష్మి తెలిపారు. బుధవారం వాకాడు స్పెషల్ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో కార్యాలయంలోని ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కాలంలో అక్రమంగామద్యంతీసుకెళ్తూపట్టుబడినవాహనాలనుప్రభుత్వంవేలం వేసేందుకు అనుమతి ఇచ్చిందని ఆక్రమంలోనేనాలుగుదఫాలుగాసంబంధించిన అధికారుల సమక్షంలో బహిరంగంగా వాహనాలకు వేలం పాట జరిగిందని తెలిపారు. ఈ నెల 27వ తేది జరగబోయే బహిరంగ వేలంలో ఆటో, పల్సర్ బైక్ ఉన్నాయని ఆమె తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారమే బహిరంగ వేలం పాటలో ప్రతి ఒక్కరూ పాల్గొనవచ్చని, పాల్గొనే ముందు ధరావతు చెల్లించాలని ఆమె తెలిపారు. సర్కిల్ పరిధిలోని కోట వాకాడు చిట్టమూరు మండల ప్రజలు బహిరంగ వాహనాలు వేలం పాటలు పాల్గొనవచ్చని ఆమె తెలిపారు.

# అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి

## ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు

వాకాడు, అక్టోబర్ 26, ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధి కోసం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నాడని గూడూరు శాసనసభ్యుడు వెలగపల్లి వరప్రసాద రావు పేర్కొన్నారు. బుధవారం వాకాడు మండలం నెల్లపూడి పంచాయితీ పరిధిలోని నెల్లిపూడి గ్రామంలో గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో వెలగపల్లి వరప్రసాద రావు ఇంటింటికి తిరిగి రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు కరపత్రాన్ని మహిళలకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాల ద్వారా మహిళలు అభివృద్ధి చెందారన్నారు. పేద బడుగు బలహీన వర్గాలకు అభివృద్ధి పథకాలు పెట్టారన్నారు. ముఖ్యంగా గడప గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో



భాగంగా గ్రామ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. అభివృద్ధే ధ్యేయంగా పని చేయడం జరుగుతుందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేందుకు మరింత సేవలు అందించేందుకు గాను సచివాలయాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. రానున్న వర్షాలు సీజన్‌లో అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు అందు బాటులో ఉండాలన్నారు. అత్యవసర సేవలు అందించాలని అధికారులకు సూచించారు. పంచాయితీ పరిధిలోని ఏ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ఆయన నాయకులను కోరారు. ఈకార్యక్ర మంలో వాకాడు సొసైటీ అధ్యక్షులు కొడవలూరు దామోధర్ రెడ్డి, ఎంపిడిఓ గోపినాథ్, ఇన్చార్జి తహశీల్దార్ సారంగపాణి, ఎస్ఐ రఘునాథ్, ఎంఈఓ బాబు, సర్పంచ్ పోలమ్మ, నాయకులు నూతన పాటి వెంకటరమణయ్య, అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రిత మృతిపై విచారణ జరపడండి

**-టిడిపి మరియు మిత్రపక్షాల ఆధ్వర్యంలో ధర్నా**



శ్రీకాళహస్తి, అక్టోబర్ 26 ప్రభాతవార్త : నియోకజవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని ఆర్టీసి బస్టాండు వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద తెలుగు దేశం పార్టీ మరియు జనసేన ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ అనుమా నాస్పద స్థితిలో కెవిబిపురం మండలం కోవనూరు సమీపంలోని తెలుగుగంగ కాలువలో శవమై తేలిన చంద్రిత(16) మృతిపై విచారణ జరిపి దోషులను శిక్షించాలని తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్ సమీపంలోని మంచినీళ్ళగుంట ప్రాంతంలో నివాసం ఉంటే లలితమ్మ,ఠాగూర్ దంపతుల కుమార్తె చంద్రిత తమ బంధువుల గ్రామమైన శ్రీకాళహస్తి మండల రామాపురం గ్రామానికి చెందిన సచివా లయ వాలంటీరు చంద్రశేఖర్‌తో పరిచయం ఏర్పడిందన్నారు. అయితే వివాహమైనప్పటికీ చంద్రితను చంద్రశేఖర్ తో పరిచయం ఏర్పడిందన్నారు. అయితే చంద్రశేఖర్‌కు వివాహమైనప్పటికీ చంద్రిను ప్రేమపేరుతో మోసం చేశారన్నారు. ఈవిషయమై తల్లిదండ్రులు తమ కుమార్తె భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సూళ్ళూరుపేట నియోజకవర్గం దొరవారిసత్రంలో తమ బంధువుల ఇంటి వద్ద వదిలారన్నారు. అయినా చంద్రశేఖర్ అక్కడకు వెళ్ళి చంద్రితను కిడ్నాప్ చేసుకుని వెళ్ళాడని ఆరోపించారు. ఈఘటనపై తల్లిదండ్రులు పోలీసులకు పిర్యాదుచేశారని పేర్కొన్నారు. ఐదు రోజుల క్రిందట కెవిబిపురం మండలం కోవనూరు సమీపంలోని తెలుగుగంగ కాలువలో చంద్రిత శవమై తేలిందనానరు. అప్పటి నుంచి మృతురాలి తల్లిదండ్రులు పోలీసులు చుట్టు తిరుగుతున్నా న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రశేఖర్‌కు రామా పురంకు చెందిన ఓ ప్రజాప్రతినిధి అండ ఉండడంతో అధికారులు మౌనం పాటిస్తున్నారని విమర్శించారు. అనంతరం నేతలు ప్రదర్శనగా వెళ్ళి డిఎస్పీ విశ్వనాథ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర తెదేపా కార్యదర్శులు గుమ్మడిపూడి దశరధాచారి, రెడ్డివారిగురవారెడ్డి, రాష్ట్ర మహిళానాయకురాలు రేణుకాదేవి, పార్లమెంటు నాయకులు రంగినేనిచెంచయ్యనాయుడు, చక్రాల.ఉష, రావిళ్ళ మునిరాజ నాయుడు, మిన్నల్‌రవి, పార్టీ ఉపాధ్యక్షుడు పోలూరుశ్రీనివాసులురెడ్డి, కన్నావరం హరిబాబు, నెమళ్ళూరు సుబ్రమణ్యం(బుజ్జి), షఫి, డివినారాయణ, ధనంజయుడు, జిలానీ, కామేష్ యాదవ్, మునిరాజ యాదవ్, సుబ్బయాదవ్, వెంకటేష్, జనసేన నేతలు కొట్టేసాయి, చిరంజీవి, మహేష్, లీలా, తెదేపా కార్యకర్తలు సన్నీ, సునీల్, మణి, రామకృష్ణ, యాదగిరి, మహిళా నాయకురాళ్లు చిట్టెమ్మ, సుమతి, దుర్గ, చంద్రకళ, మల్లీశ్వరి, సునీమా తదితరులు పాల్గొన్నారు.

## అడవి జంతువుదాడి - ఒకరికి తీవ్ర గాయాలు



బంగారుపాళ్యం, అక్టోబర్ 26 ప్రభాతవార్త: మండలంలోని కాటప్ప గారిపల్లి పంచాయతీ ఎద్దులవారిపల్లి గ్రామ సమీపంలోని మామిడి తోటలో కాపలాదారుడిగా వున్న చంద్రయ్య(45)పై బుధవారం తెల్లవారు జాము ఓ అడవి జంతువు దాడి చేసింది. ఈ దాడిలో తీవ్రంగా గాయ పడిన చంద్రయ్యను బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళారు. చంద్రయ్య గుంతూరు గ్రామంకు చెందిన వ్యక్తి. ఇతను మామిడి తోటలో కాపలా దారుడిగా వుంటూ అక్కడే ఒక పూరి పాకలో జీవిస్తున్నాడు. మామిడి తోటకు సమీపంలోని అటవీ ప్రాంతం నుండి ఓ అడవి జంతువు చంద్రయ్యపై దాడి చేసింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చంద్రయ్యను వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, ఇతర వైకాపా నాయకులు పరామర్శించారు. బంగారుపాళ్యం సిఐ నరసింహారెడ్డి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డిలు గ్రామంకు వెళ్ళి గ్రామస్తులకు భరోసా కల్పించారు. ఇది కేవలం అడవి జంతువు మాత్రమేనని చిరుతపులి కాదని చెప్పారు. అటవీ సిబ్బంది సంఘటనా స్థలంలో జంతువు యొక్క కాలి ముద్రలను సేకరించారు.

## ఏఎన్ఎం దివ్యతేజకు సేవారత్న రాష్ట్ర అవార్డు

ఓజిలి, అక్టోబర్ 26 ప్రభాతవార్త : కరోనా సమయంలో ఉత్తమ వైద్యసేవలు అందించినందుకు తిరుపతి జిల్లా ఓజిలి మండలం వజ్జావారిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న దివ్యతేజకు మదర్‌థెరిస్సా సోషల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో సేవారత్న స్టేట్ అవార్డు కింద ప్రశంసాపత్రం అందజేశారు. జిల్లాస్థాయిలో మొదటి సేవారత్న స్టేట్ అవార్డు అందుకున్నందుకు దివ్యతేజను ఆసుపత్రుల సిబ్బంది, డాక్టర్లు, తోటి సిబ్బంది, అధికారులు అభినందనలు తెలిపారు. ఉత్తమ వైద్యసేవలు అందించిన వారికి ఎప్పటికైనా తగిన గుర్తింపు ఖచ్చితంగా ఉంటుందని పలువురు అభినందనలు తెలిపారు.

## జిల్లాస్థాయి క్రీడా పోటీలకు శ్రీహరికోట జడ్పీ విద్యార్థులు ఎంపిక



శ్రీహరికోట (తడ), అక్టోబర్ 26 ప్రభాతవార్త : శ్రీహరికోటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్కూల్ గేమ్స్ జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. మండల స్థాయి మరియు నియోజకవర్గ స్థాయిలో పలువురు విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచినట్లు షార్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు వెంకటేశ్వర్లు తెలిపారు. అథ్లెటిక్స్, ఖోఖో, త్రోబాల్ పోటీలలో వీరు ప్రతిభ చూపించి జిల్లాస్థాయికి ఎంపికయ్యారని, నవంబర్ 15 నుంచి నాలుగురోజుల పాటు జరిగే పోటీలలో వీరు నెల్లూరులో జరిగే క్రీడల్లో పాల్గొంటారని ఆయన చెప్పారు. ఈ ఎంపిక పట్ల వ్యాయామ ఉపాధ్యాయుడు సన్నాయి భాస్కర్, ఇతర ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులు కూడా జిల్లాస్థాయిలో మరింత ప్రతిభచూపి బహుమతులు గెలుచుకుంటారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## పోలీస్ కుటుంబాలను పరామర్శించిన ఎస్పి



తిరుపతి (క్రైం), అక్టోబర్ 26 ప్రభాతవార్త: పోలీస్ అమరవీరుల వారోత్స వాల్లో భాగంగా విధి నిర్వ హణలో మృతి చెందిన పోలీస్ కుటుంబ సభ్యులను తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా దిశ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ వెంకటమునీ, ట్రాఫిక్ ఎస్ఐ సుబ్రమణ్యం, మునిరత్నం రెడ్డి, కుటుంబ సభ్యులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఇళ్లల్లో వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఎస్పి మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు కుటుంబాలకు పోలీస్ శాఖ ఎప్పుడు అండగా నిలుస్తుందన్నారు. ఎప్పుడు ఎలాంటి అవసరం వచ్చినా ఎస్పీ కార్యాలయానికి రావచ్చు అన్నారు. పోలీస్ సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని హామీ ఇచ్చారు.

# ప్లాస్టిక్ నిషేధం ఎక్కడ!

**- ప్లాస్టిక్ వ్యర్థాలతో పేరుకుపోయిన నాయుడుపేట**
**- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం**
**- విచ్చలవిడిగా పాలిథిన్ కవర్ల వినియోగం**
**- బహిరంగంగా విక్రయాలు - పట్టించుకోని అధికారులు**

నాయుడుపేట రూరల్, అక్టోబర్ 26 ప్రభాతవార్త : ఎంత కాలం పోయినా భూమిలోకి కలిసిపోని ప్లాస్టిక్ కవర్లను నిషేధించే అంశం నీరుగారిపోతోంది. నాయుడుపేటలో పాలిథిన్ కవర్ల వినియోగం పెద్దమొత్తంలో జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని ప్రకటించినా బహిరంగంగా విక్రయాలు సాగుతున్నాయి. నాయుడుపేటలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలే దీనికి సాక్షంగా చెప్పవచ్చు. ఎక్కడి నుంచి ఎక్కడికైనా తేలికగా తీసుకెళ్లేందుకు వీలుగా ఉండటంతో ప్రజలు పాలిథిన్ కవర్లను వాడుతున్నారు. అయితే 75 మైక్రాన్లకు మించి తయారైన కవర్లను, పేపర్, బట్ట సంచులను వాడాలని కేంద్రప్రభుత్వం ప్రకటించింది. పాలిథిన్ కవర్ల వినియోగంతో భవిష్యత్ తరాలకు పెనుప్రమాదం పొంచి ఉందని, క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులు వస్తాయని విద్యావంతులు, నిపుణులు ఎప్పటికప్పుడు సూచిస్తున్నా ప్లాస్టిక్ వినియోగం తగ్గడం లేదు. ప్రతి చినన పనీ ప్లాస్టిక్ వినియోగంతో ముడిపడింది. ఫలితంగా చాలాచోట్ల మూగజీవాలు సైతం మృత్యువాత పడుతున్నాయనే ఆవేదన పలువురిలో వ్యక్తమవుతోంది. పర్యావరణానికి పెనుప్రమాదంగా తయారైన పాలిథిన్ కవర్ల నిషేధం అమల్లో ఉన్నా నాయుడు పేట డివిజన్‌లో ప్లాస్టిక్ వినియోగం జోరుగా సాగుతోంది. అధికారులు నామమాత్రంగా దాడులు నిర్వహిస్తున్నారు. దుకాణాల్లో నిషేధిత ప్లాస్టిక్ కవర్లు అమ్మితే జరిమానాలు విధిస్తామని హెచ్చరికలు జారీ చేశారు. అయితే వాటిని దుకాణదారులు పట్టించుకోవడం లేదు. చెన్నై, నెల్లూరు, తిరుపతి ప్రాంతాల నుంచి ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లు టన్నులకొద్దీ తరలివస్తోం దన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికీ టీ దుకాణాల్లో ప్లాస్టిక్ గ్లాసులు, కప్పులు, సంచులు, వాటర్ ప్యాకెట్లు వినియోగిస్తున్నారు. ఇదిలావుంటే నవంబర్ 1వ తేదీ నుంచి ఫ్లెక్సీలను రాష్ట్రప్రభుత్వం నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇది ఎంతమేరకు అమలవుతుందోనని పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఫ్లెక్సీలు కూడా పర్యావరణానికి ప్రమాదకరమని తేలింది. దీంతో ప్రభుత్వం చర్యలు చేపడుతున్నప్పటికీ ఎంతోమంది ఫ్లెక్సీల ప్రింటింగ్‌తో ఉపాధి పొందుతు న్నారని, కొంత సమయం ఇవ్వాలని కోరుతున్నారు.

**బహిరంగంగా విక్రయాలు**

బహిరంగంగా కొందరు వ్యాపారులు ప్లాస్టిక్ విక్రయాలను జోరుగా నిర్వహిస్తున్నారు. టన్నులకొద్దీ ప్లాస్టిక్ తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఫలితంగా ప్లాస్టిక్ జడలు విప్పుతోంది. ప్లాస్టిక్ వ్యర్థాలతో పంట కాలువలు సైతం కలుషితమై పోతున్నాయి. మద్యం దుకాణాల వద్ద ఈ ప్లాస్టిక్ వ్యర్థాలు కుప్పలుకుప్పలుగా ఉన్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలతో డంపింగ్ యార్డును తలపిస్తోంది. అధికారులు ప్లాస్టిక్ పాలిథిన్ కవర్ల నిషేధానికి చర్యయలు తీసుకోకపోతే పర్యావరణానికి పెనుసవాలుగా మారుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## నవంబర్ 1 నుండి ప్లాస్టిక్ ఫ్లెక్సీలు పూర్తి నిషేధం

**- మాంసం దుకాణాల్లో సైతం ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై కఠిన ఆంక్షలు - మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ**



చిత్తూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త: జాతీయ హరిత ట్రిబ్యూనల్ మార్గదర్శకాలు, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నవంబర్ 1వ తేదీ నుండి చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్లాస్టిక్ బ్యానర్లు, ఫ్లెక్సీలను పూర్తి స్థాయిలో నిషేధిస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ పేర్కొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం కమీషనర్ డాక్టర్ జె.అరుణ ప్లాస్టిక్ బ్యానర్లు, ఫ్లెక్సీల నిషేధంపై ఫ్లెక్సీ, బ్యానర్ల తయారీ దారులు, మాంసం దుకాణాల యాజమానులతో వేరువేరుగా సమావేశం నిర్వహించారు. కమిషనర్ డాక్టర్ జె.అరుణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా జాతీయ హరిత ట్రిబ్యూనల్ ప్రత్యేక మార్గదర్శకాలను జారీ చేసిందని ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 1వ తేదీ నుండి ప్లాస్టిక్ బ్యానర్లు, ఫెక్సీల తయారీని నిషేధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంపై వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలను నగర పరిధిలో విస్తృతంగా చేపట్టనున్నామన్నారు. అలాగే మాంసం దుకాణదారులు ఇక్కడ ప్లాస్టిక్ కవర్లు వినియోగించబడదు అనే బోర్డులను దుకాణాల ఎదుట వుంచాలని ఆదేశించారు. అలాగే దుకాణాల్లో పరిశుభ్రత పాటించాలని చేతులకు గ్లౌజులు తొడుక్కోవాలని స్పష్టం చేశారు. అలాగే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సహాయ కమీషనర్ గోవర్ధన్, ఎంహెచ్ఓ డాక్టర్ అనిల్‌కుమార్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ చిన్నయ్య, వార్డు కార్యదర్శులు, మాంసం దుకాణ యాజమానులు, ఫ్లెక్సీ, బ్యానర్ల తయారీ దారులు పాల్గొన్నారు.

## ఎంబిబిఎస్ కోర్సుల్లో అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభం



తిరుపతినగరం, అక్టోబర్ 26 ప్రభాతవార్త : శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ఎంబిబిఎస్ కోర్సు నందు 22-23 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభమైనట్లు స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంగమ్మ తెలిపారు. నీట్‌లో ర్యాంకు సాధించిన ఒరిస్సా రాష్ట్రానికి చెందిన నందినిరాయ్ డాక్టర్ వెంగమ్మ ద్వారా మొదటి అడ్మిషన్ పొందారాని వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలిండియా కోటా ద్వారా 26 సీట్లలో మొదటి రోజు నలుగు విద్యార్థినులు చేరారన్నారు. ఇందులో ఒకరు ఉత్తరప్రదేశ్ నుంచి ఇద్దరు, రాజస్థాన్, ఒరిస్సా నుంచి ఒక్కోరు చేరారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శరణ్ బి.సింగ్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ ముక్తేశ్వరయ్య, డాక్టర్ కె.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

## గంగమ్మ ఆలయంలో భక్తితో కేదారేశ్వరనోములు



తిరుపతి,అక్టోబర్ 26ప్రభాతవార్త: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో బుధవారం ఉదయం కేదారేశ్వరనోములు అత్యంత భక్తిశ్రద్ధలతో మహిళ భక్తులు నిర్వహించారు. గంగమ్మ ఆలయ అర్చకులు భక్తులతో నోములు వ్రతాన్ని చేపట్టారు.మహిళ భక్తులకు గంగమ్మ ఆలయం తరపున ప్రసాదంగా గాజులు, పసుపుదారం, పసుపుకుంకుమ అందజేశారు. ఈ వ్రతాన్ని ఆలయ పాలకమండలి ఛైర్మన్ కట్టా గోపీయాదవ్, ఇఒ ఎం.మునికృష్ణయ్య, ధర్మకర్తలు గీత ,మహిళ భక్తులు పాల్గోన్నారు.

## అధికారులు సమన్వయంతో పనిచేయాలి: కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 26 ప్రభాతవార్త : అర్హులైన ప్రజలకు కేటాయించిన జగనన్న ఇంటి నిర్మాణాలు వేగవంతం చేసేందుకు హౌసింగ్ సిబ్బంది, ఇంజనీరింగ్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ ఇంజనీర్ అధికారులు, హౌసింగ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలంటే అధికారులు అంతా కలిసి సమన్వయ నిర్ణయాలు తీసుకుని ముందుకెళ్లాలని సూచించారు. బేస్‌మెంట్లు పూర్తి కావాలంటే అయిపోయిన నిర్మాణాలకు అధిక సంఖ్యలో కావాల్సిన ఇటుకలను పెద్ద మొత్తంలో సరఫరా చేసేందుకు వున్నటువంటి ఇటుకల ప్యాక్టరీల వివరాలను హౌసింగ్ అధికారులు సిద్ధం చేసి త్వరగా అందించాలని ఆదేశించారు. వీలైనంత వరకు ఇళ్ళ నిర్మాణాలు చేపట్టిన లే అవుట్లకు దగ్గరగా ఉండే ఇటుకల సరఫరా కేంద్రాలను సంప్రదించాలన్నారు. ఇటుకలు సరఫరా జరిగిన వెంటనే ఆలస్యం కాకుండా గోడలను పూర్తి చేసేందుకు తమ సిబ్బందితో ఇంజనీరింగ్ అధికారులు సంసిద్ధంగా వుండాలని కమిషనర్ సూచించారు. డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, హౌసింగ్ డీఈ శ్రీరాములు, మున్సిపల్ డిఈలు రవీంద్ర రెడ్డి, గోమతి, దేవిక, సంజయ్ కుమార్, మహేష్, హౌసింగ్ ఏఈలు పాల్గొన్నారు.

## నాడు నేడు పనుల్లో వెలుగు ఎపిఎంలు భాగస్వామ్యం

**-ఆర్‌జెడి వెంకటకృష్ణారెడ్డి**




శ్రీకాళహస్తి, అక్టోబర్ 26 ప్రభాతవార్త: నాడు నేడు పనుల్లో వెలుగు ఎపిఎంలు భాగస్వామ్యం కావాలని ఆర్‌జెడి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని కాసాగార్డెన్‌లో తిరుపతి, చిత్తూరు, అన్న మయ్య జిల్లాలకు చెందిన వెలుగు ఎపిఎంలకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిధులుగా తిరుపతి, చిత్తూరు డిఈవోలు డాక్టర్ శేఖర్, పురుషోత్తం, ఈటిసి ప్రిన్సిపల్ నాగపద్మజలు విచ్చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని అతిధులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆర్‌జెడి మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల కన్నా నేడు ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యకు ఇచ్చిన ప్రాధాన్యత దేనికీ ఇవ్వడం లేదన్నారు. విద్యార్థులకు చక్కని భవిష్యత్తును నిర్ణయించడంలో మంచినిర్ణయాలు తీసుకుంటూ ముందుకెళ్తున్నార న్నారు. పేదరికం నుంచి బయటకి రావాలంటే విద్య ఒక్కటే ముఖ్యం అన్నారు. ఎస్‌సి,ఎస్‌టి, బిసి, మైనార్టీలు గ్రామాల నుంచి అర్బన్ ప్రాంతాలకు వస్తున్నారని విద్యాశాఖలో ఏపిఎంలు నాడు నేడు పనులు దృష్టిసారించేలా ఉండాల్సిన బాధ్యత ఉండేలా వారిని ప్రభుత్వం భాగస్వామ్యం చేసిందన్నారు. 3ఏళ్ళలోనే విద్యాశాఖలో పెనుమార్పులు వచ్చాయని ఏరాష్ట్రంలోను లేని విధంగా పాఠశాలలు ఇక్కడ ఉన్నాయన్నారు. ప్రపంచంలో పెనుమార్పులు చోటుచేసుకుంటున్నాయన్నారు. నాడు నేడు, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద తదితర కార్యక్రమాలుచేపట్టారన్నారు. విద్యాశాఖలో ఇద్దరు ఎంఈవో లను నియమించనున్నారని ఇందులో ఒకరు అకడమిక్, మరొకరు నాన్ అకడమిక్ పాలన చూసుకుంటా రన్నారు. మూడోవిడత నాడు నేడు పనుల్లో రూ.16వేలకోట్లతో ప్రారంభించనున్నట్లు వివరించారు. తొలివిడత నాడు నేడు పనుల్లో పనుల్లో లోపం కనిపించిందన్నారు. తిరుపతి డిఈవో డాక్టర్ వి.శేఖర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలోని 34మండలాల్లో ఎపిఎంలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం ఉంటుందని ప్రభుత్వం విద్యావ్యవస్థపై పూర్తిసమగ్రస్థాయిలో దృష్టిసారించిందన్నారు. తిరుపతిలో 1079 పాఠశాలలకు రెండో విడతలో పనులు చేపట్టామన్నారు. 30సంవత్సరాల తర్వాత పాఠశాలలు ఎంతో కళకలలాడుతు న్నాయన్నారు. అంగన్‌వాడీల మరమ్మతులు చేపడుతున్నామని, పాక్షిక మరమ్మత్తులుకు రూ.2.5లక్షలు, పూర్తిస్థాయి మరమ్మత్తులకు రూ.5లక్షలు నిధులు అందించున్నా రన్నారు. అంగన్‌వాడీల్లో ప్లాస్టిక్ బియ్యం వచ్చిందన్న అపోహలు వచ్చాయని ఇవి ప్లాస్టిక్ బియ్యం కాదని పోషకాహార విలువలతో కూడిన బియ్యం అని కిలో రూ.75లుగా తెలిపారు. పాఠశాలలకు మెయింటెన్స్ గ్రాంట్ కింద రూ.450కోట్లు విడుదల చేసిందని ప్రస్తుతం రూ.20కోట్లు ఇచ్చారన్నారు. నాబార్డు నిధులతో చేపట్టిన నిధులు సగంలో ఆగిపోయాయని ప్రస్తుతం వీటిని నాడు నేడు పనుల్లో చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చిత్తూరు డిఈవో పురుషోత్తం, ఈఈ రవీంద్రబాబు, సిఎంఓ గుణశేఖర్‌రెడ్డి, డిప్యుటీ డిఈవో రఘునాధరెడ్డి, డిపిఎం వెంకటేష్, శ్రీకాళహస్తి ఎంఈవో ఆర్.భువనేశ్వరిలతో పాటు తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి 96మంది ఎపిఎంలు శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు.

## యువత ఉపాధి శిక్షణ, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**-యువతకు ఉద్యోగ రూపకల్పనకు ప్రతి నియోజకవర్గానికి స్కిల్ హాబ్**

**తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి**



తిరుపతిరూరల్, అక్టోబర్26 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం యువత కోసం సాంకేతిక శిక్షణ, ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించటానికి ప్రతి నియోజకవర్గంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఒక స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేస్తుందని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. తిరుపతిలో ఐ.టి.ఐలో స్కిల్ హబ్‌ను గురువారం జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడతూ నిరుద్యోగ యువత స్కిల్ హబ్‌ను వినియోగించుకుని సాంకేతిక శిక్షణతో ఉద్యోగ అవకాశాలు పొందాలని, అందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వందశాతం ఉద్యోగ అవకాశాలు కల్పన దిశగా పయనిస్తుం దన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన యువత ఉద్యోగ అవకాశాలు వద్దనుకుంటే స్వయం ఉపాధి ద్వారా కూడా స్వంతంగా ఏర్పాటు చేసుకోవచ్చునని తెలిపారు. దీని ద్వారా మరో నలుగురికి ఉపాధి అవకాశాలు కల్పించవచ్చునని తెలిపారు. ప్రారంభమైన 90రోజుల ఎలక్ట్రికల్ కోర్సు యువత ఏ.సి. వాషింగ్ మిషన్, ఫ్రిజ్ వంటి వాటిలో ఐ.టి.ఐ. సహకారంతో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి మూడు నెలలకు 60మందికి శిక్షణ ఇవ్వడానికి అవకాశం కలదన్నారు. నేటి నుండి శిక్షణకు హాజరైన యువతతో ముఖాముఖీ నిర్వహించి మీరు కోర్సు పూర్తి చేసుకుని వెళ్ళేటప్పుడు బాధ్యతగా మరొకరిని ఈ శిక్షణలో చేర్పించాలని సూచించారు. ఈ శిక్షణకు మహిళలు కూడా హాజరుకావడం సంతోషదాయకమన్నారు. ఈ శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వం జారీ చేసే ధృవపత్రం, ట్రావలింగ్ అలవెన్స్ లేదా బస్ పాస్ సౌకర్యం కల్పిస్తారన్నారు. త్వరలో సచివాలయాలలో శిక్షణ కోసం నమోదు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జ్యోతి, ఉప సర్పంచ్ రాజ్యలక్ష్మీ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్యామ్ మోహన్, డిఆర్‌డిఏ పి.డి. జ్యోతి, ఇండస్ట్రియల్ ట్రైనర్ ఆనందరావు, ఐ.టి.ఐ ప్రిన్సిపల్ లక్ష్మీ, జిల్లా ఎంప్లాయిమెంటల్ అధికారి పల్లవి తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో కార్తీక మాసం ఆరంభం



సదుం అక్టోబరు 26ప్రభాతవార్త : మండల పరిధిలో బుధవారం నుంచి కార్తీక మాసం ఆరంభమైంది. యర్రాతివారిపల్లెలోని అయ్యప్ప స్వామి వారి ఆలయంలో అయ్యప్ప భక్తుల సందడి మొదలైంది. అదేవిధంగా నడిగడ్డ మల్లేశ్వరస్వామి వారి ఆలయం, సదుంలోని శ్రీసుబ్రమణ్య స్వామి వారి ఆలయం, శ్రీవీరభద్రస్వామి వారి ఆలయం, బూరగమందలోని శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి వారి ఆలయాలలో కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు ప్రారంభించారు. ఉదయం పలువురు భక్తులు గార్గేయనదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయాలలో ఉదయం, సాయంత్రం కార్తీక దీపాలు ఏర్పాటు చేశారు. స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు వ్రతం ఆచరించారు.

# గట్టు మిగిలితే ఒట్టు!

**-అనుమతులు గోరంత అక్రమం కొండంత...?- ఓజిలి మండలంలో ఇరిగేషన్, మైనింగ్ అధికారులు ప్రేక్షకు పాత్ర-అనుమతులు లేవు, అడిగేవాళ్లు లేరు-విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు - అక్రమార్కుల ఇష్టారాజ్యం- పేదల పొలాలను, చెరువులను, గుట్టలను, సైతం వదలని సైతం-వాల్టా చట్టానికి తూట్లు**



ఓజిలి, అక్టోబరు 26 ప్రభాతవార్త: కొండా, గుట్ట, వాగు, వంకా, చెరువు గట్టు, కాలువ కట్ట, అదీ ఇదీ తేడా లేదు కన్ను పడితే చాలు కొల్లగొట్టి కాసులు పిండుకున్న వైనం ఓజిలి మండలంలో ఇరిగేషన్, మైనింగ్ అధికారులు కళ్లుండి చూడలేకపోతున్నారు. అక్రమాన్ని తెలిసీ ఏం చేయలేకపోతున్నారు. ప్రభుత్వ స్థలాల పేరుతో ప్రైవేటు మట్టిని తరలిస్తున్నా చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. సందట్లో సడేమియాగా మట్టి మాఫియా రెచ్చిపోతుంది. శతకోటి మోసాలకు, అనంత కోటి ఉపాయాలు, అన్నచందంగా అక్రమ మట్టి తరలింపు కోసం మాఫియా కొత్త ఎత్తుగడ వేసింది. మట్టి అక్రమ తరలింపుకు ఇరిగేషన్, మైనింగ్ అధికారులు రాజబాటను వేశారని మండల ప్రజలు అంటున్నారు. దర్జాగా మట్టి దోపిడీకి కొందరు నాయకులు తెరదీశారు. అక్రమార్కుల నుంచి భారీగా ముడుపులు అందుతుండడంతో మట్టి అక్రమ తరలింపు ప్రక్రియను సంబంధిత ఇరిగేషన్ శాఖ, మైనింగ్ శాఖ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మట్టి దందా మండలంలో యథేచ్ఛగా సాగుతోంది. అనుమతులు లేవు, అడిగే వాళ్లు లేరు, ఇంకేముంది గుట్టలను తవ్వేస్తున్నారు. రూ.లక్షల విలువ చేసే మట్టిని దోచుకెళుతున్నారు. ఇలా అక్రమార్కులకు మట్టి వ్యాపారం కాసుల వర్షం కురిపిస్తుండగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఓజిలి మండలంలోని పలు గ్రామాల శివారులోని ప్రభుత్వ చెరువుల్లో, ప్రైవేటు భూముల్లో ఉదయం, రాత్రి వేళలో నిత్యం అక్రమంగా జేసీబీల సాయంతో మట్టి తవ్వకాలు చేపట్టి టిప్పర్ల ద్వారా, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. అక్రమార్కులు మట్టిని తవ్వి ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. కొందరు చోటా, బడా నాయకులు, అనుచరులు ఈ దందా సాగిస్తున్నారు. ప్రభుత్వ సంపదను కొల్లగొడుతున్న నియంత్రించే నాథుడే కరువయ్యారు. యథేచ్ఛగా తరలింపు మట్టిని కాపాడాల్సిన మైనింగ్ అధికారులు పట్టించుకోకపోవడంతో యథేచ్ఛగా తరలిస్తున్నారు. జేసీబీ యంత్రాలు పెట్టి టిప్పర్ల ద్వారా మట్టి తరలిస్తూ లక్షలాది రూపాయలు గడిస్తున్నారు. వాణిజ్య సముదాయాలు, ప్రైవేటు భవనాలు, రియల్ వెంచర్స్, షాపింగ్ కాంప్లెక్స్, గోదాం నిర్మాణాలకు తరలిస్తూ టిప్పర్‌కు రూ.7 వేల నుంచి 10 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇక ట్రాక్టర్‌కు రూ.400 నుంచి 1000 వరకు వసూలు చేస్తున్నారు. ఇష్టారాజ్యంగా తవ్వకాలతో గుట్టలు మాయమవుతున్నాయి.

**అనుమతి లేకుండా తవ్వకాలు :**

మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్న మట్టి గుట్టలను విచ్చలవిడిగా తవ్వకాలు చేపడుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. గుట్టల, కాలువలు, చెరువులు, తవ్వకాలను రెవెన్యూశాఖ అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. ఇచ్చిన అనుమతి మేరకు మైనింగ్ శాఖకు పన్ను చెల్లించాలి. క్యూబిక్ రూ.42 చొప్పున చెల్లించాకే మట్టి తవ్వకాలు జరపాలి. ముందుగా తవ్వకాలకు సంబంధించి ఈ రెండు శాఖల నుంచి అనుమతులు పొందాలి. ఈ నిబంధనలేవీ ఇక్కడ అమలు కావడం లేదు. అక్రమార్కులు ఇష్టానుసారంగా ఎప్పుడు అవసరమైతే అప్పుడు ప్రభుత్వ భూములను చెరువులను తవ్వేస్తున్నారు. పెద్ద ఎత్తున ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిండు కుండల్లా కళకళలాడిన ఏళ్ళ నాటి చెరువులు అక్రమార్కుల చెరలో చిక్కి తమ ఉనికిని కోల్పోతున్నాయి. ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువులు కాల క్రమేపి కనుమరుగవుతున్నాయి. నీటి పారుదలశాఖ, అధికారులు ధన దాహానికి చరిత్ర కలిగిన చెరువులు కబ్జాకు గురవుతున్నాయి. మట్టి మాఫియా కంటపడిన చెరువులు, రోజుల వ్యవధిలోనే వాటి రూపురేఖలను కోల్పోతున్నాయి. వందల ఏళ్ళ నుంచి తాగు, సాగు నీటి అవసరాలను తీర్చిన చెరువును కాపాడేందుకు అధికారులు విఫలమవుతున్నారు. నీటి పారుదల, మైనింగ్ అధికారులు కొందరికి భారీ మొత్తంలో ముడుపులు ముట్టచెప్పడంతో చర్యలు తీసుకునేందుకు మీన మేషాలు లెక్కిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో ఫిర్యాదులు రావడంతో తూతూ మంత్రంగా నివేదికలు తయారు చేసిన మైనింగ్, నీటి పారుదలశాఖ అధికారులు ఆ తరువాత చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు ఎలా అనుమతులు మంజూరు చేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఏప పత్రాలను చూపించి అనుమతులు తీసుకున్నారనే దానిపై స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి ఎన్నో ఏళ్ళనాటి చెరువులను కాపాడాలని కోరుతున్నారు.